క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఈపూరు: వినుకొండలోని 133 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ గాంధీబాబు తెలిపారు. అధికలోడును అధిగమించేందుకు వినుకొండలోని 133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎక్స్‌టెన్షన్ చేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

సాతులూరు పరిధిలో...

నాదెండ్ల: సాతులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ సాతులూరు, చందవరం, నరసరావుపేట రూరల్ మండలం దొండపాడు, ఇండస్ట్రియల్, గృహ అవసరాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

తీగలపై తొండపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలోని చవిటిపాలెం 11 కేవీ విద్యుత్ వైరుపై తొండ పడటంతో సుమారు గంటన్నరపాటూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తెగిన వైర్లకు మరమ్మతులు నిర్వహించారు. గంటన్నరపాటూ గృహ, ఇండస్ట్రీయల్ సరఫరా నిలిచింది. 6 గంటలకు సరఫరా నిలిచిపోగా, అధికారులు స్పందించి 7.30 గంటలకు పునరుద్ధరించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన చట్టు శ్రీనివాసరావు, దుర్గాంబ దంపతులు రూ.1,00,000లు విరాళంగా అందజేసారు. ఆలయ కార్యాలయంలో శుక్రవారం విరాళం చెక్‌ను ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డికి శ్రీనివాసరావు దంపతులు అందించారు. త్వరలో ప్రారంభం కానున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ సుధాకరరెడ్డి కోరారు.

జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా మాట్లాడుతూ కూలీల జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయించాలన్నారు. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనల ప్రకారం కూలీల ఆధార్ నమోదు చేయాలని సూచించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉద్యాన పంటల సాగు నిర్దేశించిన 65 ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ఈ పథకంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. సమీక్షలో ఏపీవో ఆంజనేయరాజు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ వాయిదా

నాదెండ్ల: చిలకలూరిపేట నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీలు సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరగాల్సిన పోటీలు వర్షం కారణంగా వాయిదా పడినట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు అంజమ్మ తెలిపారు. 14, 17 ఏళ్ళలోపు బాలబాలికలకు విడివిడిగా పోటీలు జరగాల్సి ఉందన్నారు. త్వరలో క్రీడా పోటీలు జరిగే తేదీల వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

వైద్యబృందం ఇంటింటి సర్వే

బొల్లాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన లక్ష్యమని ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా తెలిపారు. మండల కేంద్రమైన బొల్లాపల్లి పీహెచ్‌సీ పరిధిలో రేమిడిచర్ల, గుమ్మనంపాడు సచివాలయాల పరిధిలో ఆరోగ్య సురక్షపై సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో వ్యాధులను గుర్తించి వైద్య పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. అక్టోబరు 3 నుంచి నిర్వహించే వైద్య శిబిరంలో ప్రత్యే వైద్యనిపుణులు పీహెచ్‌సీ వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్య చికిత్స పొందవచ్చని తెలిపారు.

ఓపీఎస్ అమలు చేయాలి

సత్తెనపల్లి: జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన తెలుపుతూ విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపీఎస్ విధానం తప్ప మరే ఇతర విధానం ఆమోద యోగ్యం కాదన్నారు. సీపీఎస్ కంటే జీపీఎస్ విధానం మరింత నష్టదాయకమన్నారు. జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


వక్రతుండ మహాకాయ...



నరసరావుపేట కాకుమాను బజారు గణేష్ పందిరిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు



నరసరావుపేట హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దానిమ్మపండ్లతో పూజలందుకున్న గణనాథుడు



నరసరావుపేట రామిరెడ్డిపేటలోని పందిరిలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



గణపవరం రాజులబజారులో కరెన్సీ నోట్ల అలంకరణలో వినాయకుడు



వినుకొండలో పొంగళ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తజనం



వినుకొండలో అభయ గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు

గణనాథుడికి పూజలు, వీడ్కోలు పలికిన భక్తజనం

నరసరావుపేట ఈస్ట్: చవితి పందిర్లలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుష్మితరెడ్డి దంపతులు చవితి పందిర్లలోని గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పందిర్ల నిర్వాహకులు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందచేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతుల వెంట జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయ కుమార్, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు ఉన్నారు. రామిరెడ్డి పేటలోని త్రిముఖ గణపతి పందిరిలో చిన్నారు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. అలాగే మహిళలు సామూహిక కుంకుమార్చన, శ్రీలలితా సహస్ర నామార్చన నిర్వహించారు. పాతూరు మద్ది రాఘవయ్య బావి వద్ద యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ పందిరిలోని దశావతార సహిత శ్రీవీర గణపతిని శుక్రవారం 1108 దానిమ్మపండ్లతో అర్చించారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణం, రూరల్ మండలంలో గణేష్ ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని కుమ్మరి బజారు ఫ్రెండ్స్ యూత్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో 14వ వార్షికోత్సవం సందర్భంగా వైభవంగా గ్రామదేవతలకు పొంగళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో మహిళలచే ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లతో ఊరేగింపుగా బయలుదేరి పోలేరమ్మ, అంకాలమ్మకు పొంగళ్లు సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పారెళ్ల మల్లికార్జునరావు, బొంకూరి కోటేశ్వరరావు, జీడిమల్ల శ్రీనివాసరావు, వేణు, మోహన్, బొంకూరి వెంకటేశ్వర్లు, పత్తేపురం గోపాలకృష్ణ, అజయ్, దొంతు అనిల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని 15వ వార్డు తిమ్మాయపాలెం రోడ్డులో గల అభయ విఘ్నేశ్వరుని మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అభయ గణేష్ విగ్రహం వద్ద పురోహితులు కొత్తపేట గంగాధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీటలపై నాగరాజు, వెంకటేశ్వర్లు, విగ్రహదాత కాళింగ శ్రీనివాసరావు దంపతులు పాల్గొని పూజలు చేశారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెం పడమటి బజారు వారి సారథ్యంలో వినాయక విగ్రహ నిమజ్జన వేడుకలు కమిటీ సభ్యులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి లడ్డూను గ్రామానికి చెందిన మంగమూరి నాగేశ్వరరావు-లక్ష్మి దంపతులు రూ.45 వేలకు కైవసం చేసుకున్నారు. 2 వేల మందికి అన్నదానం కూడా ఏర్పాటు చేశారు. విగ్రహం నిమజ్జనం వేడుకల్లో భాగంగా మేళా తాళాలు కనక తప్పట్లు నడుమ విగ్రహాన్ని విద్యుత్ కాంతులతో ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనయుడు బొల్లా గిరిబాబు, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, వైస్సార్ సీపీ నాయకులు పచ్చవ శ్రీనివాసరావు, కావూరి మాబుసుభానయ్య, బొడ్డు పెద యల్లమంద, అంజయ్య, అప్పారావు, కొండెటి వెంకటేశ్వర రావులు గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని వయ్యకల్లు గ్రామంలో 12వ వార్షికోత్సవం సందర్భంగా వినాయక విగ్రహం నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి లడ్డూను కావూరి దానయ్య రూ. 30 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కావూరి మాబు సుభానయ్య కొర్రపాటి చౌదరి, చెవల ఏడుకొండలు, వెంకటేశ్ పాల్గొన్నారు.

వెళ్లిరావయ్య.. గణపయ్యా...



జగ్గాపురం రోడ్డులో గణేష్‌యూత్ ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుని విగ్రహం

యడ్లపాడు: వినాయక నిమజ్జనానికి మండలంలోని రెండు గ్రామాలకు చెందిన నాలుగు వినాయక విగ్రహాలు శుక్రవారం తరలి వెళ్లాయి. ఐదుల పూజలనంతరం గణనాథునికి అంగరంగ వైభవంగా బాణాసంచా, డీజే సౌండ్స్‌తో గణనాథుల విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. భక్తులు గణనాథుడిని సందర్శించి పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. యడ్లపాడు జగ్గాపురం రోడ్డులో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం, ఇసుకపాలెం గ్రామం, ఉన్నవ గ్రామాల్లో రెండు విగ్రహాలు అర్ధరాత్రి వరకు ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.

కొనసాగుతున్న నిమజ్జనాలు

నాదెండ్ల: వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఐదో రోజు గణనాథుడు పూజలందుకున్నాడు. ఆయా ఆలయాలు, ప్రత్యేక చలువ పందిళ్లలో భక్తులు గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పలు గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. గణపవరం పోలేరమ్మ ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన చలువ పందిరిలో విగ్రహానికి ప్రత్యేక పూజల అనంతరం 10 కేజీల లడ్డూ ప్రసాదాన్ని వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన పోపూరి వంశీ రూ.28 వేలకు ప్రసాదం దక్కించుకున్నాడు. రాజుల బజారులో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి రూ.1లక్ష విలువైన రూ.500ల కరెన్సీ నోట్లతో అలంకరించారు. అనంతరం రెండు విగ్రహాలను చీరాలకు నిమజ్జనానికి తరలించారు. గణపవరంలో నూతనంగా నిర్మించిన రామాలయం వద్ద ఏర్పాటు చేసిన మట్టి విగ్రహానికి శనివారం కమిటీ సభ్యులు నిమజ్జనం చేయనున్నారు. గ్రామానికి చెందిన కెల్లంపల్లి శ్రీనివాసరావు దంపతులు ప్రసాద వితరణ గావించారు.



లడ్డూని కైవసం చేసుకున్న భక్తుడు

సచివాలయాల్లో ప్రగతిపథం పుస్తక పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని అప్పాపురం, తలార్లపల్లి, నూజెండ్ల గ్రామ సచివాలయాల్లో ప్రగతిపథంలో మన వినుకొండ అనే పుస్తకాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండ నియోజకవర్గంలో చేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ఫొటోలు, నిధులతో సహా ఈ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం బాలిరెడ్డి, వంగూరి ప్రసాద్, చిన్నతరహా పరిశ్రమల స్టేట్ డైరెక్టర్ తలారి ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, ఎంపీటీసీ గాదె నాగార్జునరెడ్డి సుభాషిణి, సర్పంచ్ అడప అప్పిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు



బ్రాహ్మణపల్లిలో ర్యాలీ చేస్తున్న అధికారులు



నూజెండ్లలో మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని వితంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీల్లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఈవోపీఆర్‌డీ సుందరరామిరెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పొడిచెత్త, తడి చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రలకు అందజేయాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలో....

స్వచ్ఛభారత్ మండల రీసోర్స్ సమన్వయకర్త కంచర్ల సుబ్బరామయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నూజెండ్లలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంపై ర్యాలీ, మానవహారం నిర్వహించి గ్రామప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో టి.వీరభద్రాచారి పాల్గొని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి ఆర్. శ్రీనివాస్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మతుకుమల్లిలో...

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు సారథ్యంలో ర్యాలీ మానవహారం నిర్వహించినట్లు స్వచ్ఛత మండల రిసోర్స్ పర్సన్ కె.కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధు లు ప్రబలకుండా ఉండటానికి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలన్నారు. మురుగుకాల్వలో మురుగునీరు నిల్వ ఉండకుండా శానిటేషన్ పనులు చేయాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యలగాల బసవయ్య, ఈవోపీఆర్‌డి. పి.సుగుణ, సచివాలయ ఉద్యోగులు వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దొండపాడులో ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని దొండపాడు గ్రామంలో నిదానంపాటి శ్రీ శివలక్ష్మి అమ్మవారి దేవాలయ 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ అనంతరం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు కార్యక్రమం అంగరంగవైభవంగా నిర్వహించారు. కుంకుమబండ్లతో ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల హిందూభక్తి గీతాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మొత్తం 60మంది పాల్గొన్నారు. మొదటి బహుమతి గుడిపాటి శ్రీలలితాభారతి ప్రియాంక (భీమవరం) రూ.20 వేలు, రెండో బహుమతి ఎం.కనకదుర్గ (కనపర్తి) రూ.10 వేలు, మూడో బహుమతి విజయ్ (నరసరావుపేట) రూ.5 వేలు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా హైదరాబాద్‌కు చెందిన సదాశివశర్మ, వినుకొండ ప్రఖ్యాత గాయకుడు పి.రాజు, విజయవాడకు చెందిన బాలస్వామి వ్యవహరించారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఆలయ పునః నిర్మాణానికి అంచనాలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో గంగమ్మ తల్లి దేవాలయం పునః నిర్మాణ పనుల నిమిత్తం రూ.40 లక్షల అంచనాలు సిద్ధం చేసినట్లు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాట్లాడుతూ దాతలు సహకారంతో దేవాలయం పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇందుకుగాను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తమవంతు సహాయంగా రూ.10 లక్షలు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రూ. 5 లక్షలు, ఎంపీపీ రూ. లక్ష, శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య రూ.లక్ష రూపాయలు, ముండ్రు రాఘవరావు (గ్రామవాసీ ప్రముఖ వ్యాపారవేత్త) రూ. లక్ష రూపాయలు విరాళాలు ప్రకటించినట్లు చెప్పారు. గంగమ్మ దేవాలయం నిర్మాణ పనులకు దాతలు తమవంతు సహకారం అందించాలన్నారు.

ఆర్వో ప్లాంటు పనులకు భూమి పూజ

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామపంచాయతీలో ఆర్వో ప్లాంటు (మినరల్ వాటర్ ప్లాంట్) ఏర్పాటు చేయ గదికి భూమి పూజ కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా భూమి పూజ కార్యక్రమంలో సర్పంచ్ పాపసాని విజయలక్ష్మి బాబురావు పాల్గొని మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపాన ప్రభుత్వ భూమిలో బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు సౌజన్యంతో నూతన ఆర్వో ప్లాంటు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా గది నిర్మాణానికి ఎంపీ గ్రాంటు రూ. 2 లక్షలు మంజూరు చేయగా ఆర్వో ప్లాంటు యంత్ర పరికరాలు బాలవికాస్ సంస్థ వారి వితరణ చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతా పేరయ్య, పి. సుధీర్, రాంబాబు, విప్పర్ల సుబ్బారావు, దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఎంతో ఉపయోగకరం

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి ఎన్‌సీసీలో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమానికి హాజరైన కల్నల్ సునీల్ గౌతమ్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ ద్వారా ప్రతి విద్యార్థిలో శారీరక, మానసిక పరిపుష్టితో పాటు ఆలోచనా శక్తి పెరుగుతుందనీ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని స్పష్టం చేశారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బిఎస్ఆర్‌కె రాజు, బెటాలియన్ సుబేదార్ లక్ష్మణ్‌సింగ్, హవల్దార్‌లు సుఖరామ్, షంషేర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఈసీలో ఉచిత డయాబెటిస్ పరీక్షలు

నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాలలో శుక్రవారం ఉచిత డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు. కోనాక్ డయాగ్నస్టిక్స్ సహకారంతో నిర్వహించిన క్యాంప్‌లో 160 మందికి అధ్యాపకులు, విద్యార్థులకు పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ దేశ జనాభాలో 5 కోట్ల మందికిపైగా ప్రజలు టైప్-2 డయాబెటిస్‌తో బాధపడుతున్నారని తెలిపారు. బరువుతగ్గడం, ఆకలి ఎక్కువగా వేయడం, కంటిచూపు తగ్గడం డయాబెటిస్ లక్షణాలు అని వివరించారు. కార్యక్రమంలో కోనాక్ డయాగ్నస్టిక్స్ సిబ్బంది బి.గోపిబాబు, బి.డానియేలు, బి.అజయ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఐ.శ్రీధర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



అధ్యాపకులకు డయాబెటిస్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నకరికల్లు: నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. నకరికల్లులోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. స్టాకు నిల్వలు, రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యత పరీక్షల కోసం రెండు రకాల ఎరువుల నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే ఎఫ్‌సీఓ 1985 చట్ట ప్రకారం దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.